# ఈవ్ టీజింగ్

## సూర్యప్రసాదరావు




"హలో... మీరు కోరిన పాట లేనా!" సుగుణాకరరావు ఫోన్‌లో అడిగాడు.

"అవునండీ, మీరేం చేస్తుంటారు?" టీవీలో యాంకర్ ముఖంపై చిరునవ్వులు చిందిస్తోంది.

"డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాను" సుగుణాకరరావు సమాధానం చెప్పాడు.

"నీది కో ఎడ్యుకేషన్ కాలేజీయా!" అప్పుడే ఆమె ఏకవచనంలోకి వచ్చేసింది.

"అవునండీ! ఆడపిల్లలు మగపిల్లలు కలిసే చదువుకొంటుంటాం..." సుగుణాకరరావుకు టీవీలో తన గొంతు వినిపిస్తోంటే తనకే గమ్మత్తుగా వుంది.

"కాలేజీకి రెగ్యులర్‌గా వెళ్తుంటావా!" ఆమె కుశల ప్రశ్నలు వేస్తోంది.

"తప్పకుండా వెళ్తుంటాను. అటెండెన్స్ ఎనభై శాతం పైనే.." కాన్ఫిడెంట్‌గా చెప్పాడు.

"అయితే.. పుస్తకాల పురుగువన్న మాట!"

"అవును.. ఎప్పుడూ డిస్టింక్షన్‌కు తక్కువ రాదు"

"మరి.. నీ హాబీలు..."

"కాలేజీ నుండి యింటికి... యింటి నుండి కాలేజీకి.. వీలుంటే సినిమాకు.. లేకపోతే టీవీలో మనం మెచ్చుకున్న యిటువంటి ప్రోగ్రాములు చూడడం..."

"ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో టి.వి. స్టేషన్‌కు దయల్ చేశాడు. ఎంగేజ్ సౌండ్ వస్తోంది. పట్టు వదలని విక్రమార్కునిలా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు. లక్కీగా నంబర్ కలిసింది.

"ఇంట్లో మీ అమ్మగారూ.. అక్కా చెల్లీ తమ్ముడూ వగైరా.. ఎవరైనా ఉన్నారా!"

యాంకర్ శ్రోత కుటుంబ సభ్యుల గురించి వాకబు చేస్తోంది. ఉభయకుశలోపరి అడుగుతోంది.

"ఎవరూ లేరండీ.. అందరూ బయటకు వెళ్లారు" సమాధానం చెప్పాడు.

"ఎవరూ లేకుండా మరీ చూచుకొని దయల్ చేశావన్న మాట!"

ఆమె సంభాషణ పొడిగించేస్తోంది. ఏమేమో అడుగుతోంది. అతను సమాధానాలు ఓపిగ్గా చెబుతూనే ఉన్నాడు. వచ్చే టెలిఫోన్ బిల్ దయల్ చేసే శ్రోతది గదా!

"అయితే.. రాముడు మంచి బాలుడన్నమాట!"

"అవునండీ! నాకే దురలవాట్లు లేవు" సుగుణాకరరావు వినయంగా అన్నాడు.

"దురలవాట్లు అనవద్దు. పేషన్ అలవాట్లు అను. సిగరెట్ త్రాగడం.. పాన్ మసాలా వగైరా... వగైరా..."

"అమ్మో! వాటి జోలికి పోవాలంటేనే భయం!"

"కో-ఎడ్యుకేషన్ కాలేజీ గదా! అమ్మాయిల్ని బనాయిస్తుంటావా?"

"అమ్మో! బనాయించడమే! ఏమైనా అయితే?"

"ఏమౌతుందయ్యా! అంత పిరికితనం పనికిరాదు. ఏమౌతుంది? మహా అయితే రెండు మాటలంటుంది. అయినా స్టూడెంట్ లైఫ్ ఎడ్వంచరస్‌గా ఉండాలయ్యా.. మరీ ముద్దపప్పులా వుండకూడదు.."

ఆమె అతన్ని మాటలతో రెచ్చకొట్టింది. అంతకంటే రెచ్చకొట్టే పాట మరీ వేసి చూపించింది.

సుగుణాకరరావు కాలేజీకి బయలు దేరాడు. ఫిబ్రవరి నెలాఖరు రోజులు.

పెద్దగా.. విద్యార్థులెవ్వరూ రావడం లేదు. థియరీ సిలబస్‌లు పూర్తయి పోయాయి. ప్రాక్టికల్స్ రివిజన్ కావలసిన వాళ్ళు చేసుకుంటున్నారు.

తన బ్యాచ్‌లో తను, ఓ ఆకతాయి, ఇద్దరు ఆడపిల్లలు మిగిలారు. ప్రాక్టికల్స్ అయిపోతుండగా ఓ అమ్మాయి సైకిల్ 'కీ'ని ఆకతాయిగా దాచేశాడు.

ఆ అమ్మాయి సైకిల్ 'కీ' కోసం వెతుకుతోంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ! మీరు నా సైకిల్ కీ ఏమయినా చూచారా" ఆ అమ్మాయి అడిగింది.

"నాకు తెలియదు" సుగుణాకరరావు చెప్పాడు.

ఆకతాయి మాట్లాడలేదు.

"నేను వెళ్తున్నాను.. ట్యూషనుకు టైం అవుతోంది. నువ్వు 'కీ' వెతుక్కోని రా" రెండో అమ్మాయి వెళ్ళిపోయింది.

"నేను కీ వెతుక్కుని వస్తాలే.." పాపం ఆ పిల్ల టేబిల్స్ గాలించింది. కప్‌బోర్డ్స్ వెదికింది. లాబ్ అంతా చూచింది. అయినా 'కీ' దొరకలేదు.

"మిస్. రజనీ.. ఇదిగో మీ సైకిల్ కీ!" జేబులోంచి ఆకతాయి తీసి ఇచ్చాడు.

"అయితే.. నువ్వు తీశావన్నమాట!'. రజనీ ఉక్రోషంగా అంది.

"నేనే తీశాను. కాసేపు మిమ్మల్ని ఏడిపించాలని!"

"షటప్! వళ్ళు దగ్గర పెట్టుకో! నువ్వు నన్ను ఏడిపించేది ఏమిటి? ఈవ్ టీజింగ్ చేస్తే ఏమవుతుందో తెలుసా!" ఆమె గట్టిగానే అన్నది.

అంతలో లాబ్ అటెండర్లు లోపలికి వచ్చేశారు.

సుగుణాకరరావుకు భయం వేసింది.

"పోదాం పదరా!" ఆకతాయిని బయటకు తీసుకు వచ్చేశాడు.

సైకిల్ స్టాండ్ లోంచి సైకిల్ బయటకు తీశాడు.

ఆకతాయికి సైకిల్ లేదు. "సెంటర్‌దాకా నీ సైకిల్ మీద వస్తానురా.."

"సరే.. ఎక్కు!"

"రెండు నిముషాలుండరా! అదిగో రజని వస్తాంది. షటప్.. గిటప్ అంటోంది. ఏమిటో కనుక్కుందాం." ఆకతాయి అతన్ని ఆపేశాడు.

"నువ్వేం మగవాడివయ్యా బాబూ! ఆడపిల్లల్ని ఏడిపించలేని స్టూడెంట్ కూడా స్టూడెంటేనా.." టీవీ యాంకర్ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

"ఆ అమ్మాయి ఏమయినా గొడవచేస్తే..." సందేహంగా అడిగాడు.

"ఏమవుతుందిరా? కాంపస్‌లో స్టూడెంట్స్ ఎవరూ లేరు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. మహా అయితే రెండు మాటలంటుంది. మనం కూడా రెండు మూడు మాటలు గట్టిగానే అనవచ్చు" ఆకతాయి ధైర్యం చెప్పాడు.

రజని సైకిల్ ఎక్కి రోడ్డు పైకి వచ్చేసింది.

"ముందు నువ్వు సైకిల్ పోనివ్వు. రజని సైకిల్‌కు అడ్డం పెట్టు" వెనక కారియర్‌పై కూర్చున్న ఆకతాయి హడావిడి చేశాడు.


ఆకతాయి రజని సైకిల్‌ను ఓవర్‌టేక్ చేయించాడు. ఆమె సైకిల్‌కు అడ్డంగా సైకిల్ పెట్టించాడు.

ఆమె సైకిల్ దిగింది. "సైకిల్ ఎందుకు ఆపావు?"

"ఇందాక ఏదో అన్నావు.. మళ్ళీ అను" ఆకతాయి కారియర్ దిగాడు.

"అంటాను. ఎన్ని సార్లైనా అంటాను. నా సైకిల్ కీ దాచింది చాలక పైగా నా సైకిల్ ఆపుతారా..ప్రిన్సిపాల్‌కు రిపోర్ట్ చేస్తాను" ఆమె ధైర్యం కోల్పోలేదు.

## ఆ మాత్రం చూపించకపోతే ఎలా...?



'శబ్ద్' సినిమాలో సంజయ్‌దత్ ప్రక్కన ఓ ఐటమ్ సాంగ్‌లో కనిపించడానికి కొత్తపిల్ల కోసం ఇటీవల జరిపిన ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళంతా దాదాపు ఫ్యాషన్‌టీవీ మోడల్స్‌ని మించిపోయేలా కనిపించి డ్యాన్సులు చేశారట. తెరపైన డైరెక్టర్ చెప్పినట్లు కనిపించడానికి తమకేమీ అభ్యంతరం లేదని కూడా చెప్పారట అమ్మాళ్ళు. ఇంటర్వ్యూలో ఇలా కనిపించడానికి ఏమీ అనిపించలేదా? అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అమ్మడిని అడిగితే 'ఆమాత్రం చూపించకపోతే అవకాశ మెట్లా ఇస్తారు చెప్పండి' అంటూ కారెక్కి తుర్రుమంది.

అప్పటికే ముగ్గురు నలుగురు మోటార్ సైకిల్స్, స్కూటర్‌లపై వెళ్ళేవాళ్ళు ఆగి పోయారు.

"రిపోర్ట్ చేసుకో.. మేమూ చూసుకుంటాం"

"దారి వదలిపెట్టండి. నన్ను వెళ్ళనివ్వండి"

"వెళ్ళనివ్వం" ఆకతాయి అమ్మాయి సైకిల్ హేండిల్‌పై చేయి వేశాడు.

"మొహం పగిలిపోతుంది" ఆమె ఆవేశంగా అంది.

"ఏదీ పగలగొట్టు! ఎలా పగలగొడతావో చూస్తాము" ఆకతాయి ఎత్తిన ఆ అమ్మాయి చేయి పట్టుకొన్నాడు.

అంతే! ఆమె కళ్ళనుండి గంగా గోదావరులు ప్రవహించాయి.

చుట్టూ చేరినవారు రెచ్చిపోయారు.

ఆకతాయి తప్పించుకున్నాడు.

సైకిల్‌తో సుగుణాకరరావు దొరికిపోయాడు.

అతనిపై తలా ఒక చేయి వేశారు.

రజని తిరిగి కాలేజీ కాంపస్‌లోకి వచ్చేసింది.

"వీడిని మనం కొట్టడం కాదురా! ప్రిన్సిపల్ గార్కి అప్పచెప్పాలి" ఒకరన్నారు.

"పోలీసులకు అప్పజెప్పితే సున్నంలోకి ఎముకలేకుండా చేస్తారు."

అందరూ కాంపస్‌లోకి వచ్చేశారు.

అప్పుడే టీ త్రాగి వస్తున్న మాకు ఈ సీన్ కనిపించింది.

"వీడు మా కాలేజీలో చదివే అమ్మాయిని అల్లరిపెడుతున్నాడు సార్!" సుగుణాకరరావును మాకు అప్పగించారు.

"అసలేమయిందమ్మా" మేం అడిగాము.

వెక్కిళ్ళ మధ్య ఆమె జరిగిన విషయం చెప్పింది.

"ఏరా! అమ్మాయిని ఏడిపించే స్థాయికి ఎదిగావట్రా!" మాలో ఆవేశం వున్న నలుగురు స్టాఫ్ మెంబర్లు వాడిని దబదబా బాదేశారు.

"ఇంత మందీ కొడితే వాడేమైపోతాడు. అపండి గురూ! ఆపండి! అసలే అర్భకుడు" నేను ఉండబట్టలేక అడ్డం వెళ్ళాను.

"ఇక మీరు వెళ్ళండి! వీడి సంగతి మేం చూస్తాం" మావాళ్ళన్నారు.

"అంత ఒళ్ళు బలిసిందట్రా! అక్కలు లేరురా.. చెల్లెళ్ళు లేరురా.. మళ్ళీ సుగుణాకరరావుపై మరో దెబ్బ పడింది.

"నాకేమీ తెలియదు సార్! నేను ఏమీ చేయలేదు సార్! చేసిన వాడు పారిపోయాడు సార్!" అతను ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొన్నాడు.

ఒక స్టాఫ్ మెంబర్ వాడి చేతులు తీసి మరీ చెంపలు పగలగొట్టాడు.

"వాడు చచ్చేటట్టున్నాడు. ఆ అమ్మాయికి క్షమాపణ చెప్పించి వదిలేద్దాం. బాగా చదివే కుర్రవాడు" ఓ సలహా ఇచ్చాను.

"వాడు నీ క్లాసు స్టూడెంటా!" ఓ స్టాఫ్ మెంబర్ రెట్టించాడు.

"నా క్లాసు స్టూడెంట్ కాదు. మన క్లాసు స్టూడెంట్. ఎప్పుడూ గొడవ కూడా చేయని వాడు యిలా "ఈవ్ టీజింగ్" చేశాడంటే ఆశ్చర్యంగా వుంది." నేను అనేశాను.

"దొరకనంత సేపు దొరే! దొరికితేనే దొంగ! అయినా రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు. ఇంకా ఏం కావాలి" అతనూ మరో దెబ్బ వేశాడు.

"కొట్టినంత వరకు కొట్టారు. ఆమెకు క్షమాపణ చెప్పించి వదిలేద్దాం" అప్పటికే తగలరాని చోట దెబ్బలు తగిలాయేమోనని నా అనుమానం.

"ఒరేయ్! ఆ అమ్మాయి కాళ్ళు పట్టుకొని క్షమించమని అడుగు"

"నన్ను క్షమించు. ఇటువంటి పని మరెప్పుడూ చేయను" సుగుణాకరరావు ఆ అమ్మాయి ముందు చేతులు జోడించాడు.

"అలా కాదురా! వంగి ఆమె కాళ్ళు పట్టుకో!" అతని వీపుపై మరో గుద్దు పడింది.

సుగుణాకరరావు కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

అతను కొంచెం వంగాడు.

"ఇంకా వంగారా.. వంగు! కాళ్ళు పట్టుకో" వీపుపై మరో గుద్దు...


"వీడిని ఊరికే పోనివ్వకూడదు" మరో స్టాఫ్ మెంబరు గట్టిగా పట్టుబట్టాడు.

కొట్టేవాళ్ళ ముఖాలు పరిశీలనగా చూశాను.

"అందరూ అందరే... మరియు అందరు అందరు అందరందరే" ఓ సమస్యా పూరణ పద్య పాదం జ్ఞాపకమొచ్చింది.

'భార్యకు అనారోగ్యం అని సెకండ్ సెటప్‌తో కులుకుతున్న వారొకరు.. క్లాసులు అయిపోయిన తరువాత విద్యార్థినుల పోజుల్ని రకరకాల భంగిమల్లో విశ్లేషించేవారొకరు. 'బూతు' అర్థం తప్పితే మరో అర్థంతో మాట్లాడని వారొకరు. ప్రాక్టికల్స్‌లో నర్మగర్భంగా విద్యార్థినుల స్పర్శతో ఆనందం పొందేవారొకరు. లేడీ అటెండర్‌తో చాటు మాటు సరససల్లాపాలు సాగించేవారొకరు. పరాయి ఆడవారిని తమ తల్లులుగా గాక "తమ పిల్లల తల్లులుగా" భావించే మహానుభావులు కొందరు.."

సుగుణాకరరావు వంగి ఆమె కాళ్ళను కన్నీటితో అభిషేకించాడు.



అప్పటికి పబ్లిక్ సంతృప్తి చెందింది. అందరూ చెల్లా చెదురయ్యారు. అమ్మాయిని జాగ్రత్తగా ఆమె ఇంటి వద్ద దిగబెట్టే కార్యక్రమం ఓ సిన్సియర్ స్టాఫ్ మెంబరు నెత్తిన వేసుకున్నాడు.

అందరూ అమ్మాయిపై సానుభూతి చూపించేవారే...

దెబ్బతిన్న లేడిలా విలవిలలాడిపోతున్న సుగుణాకరరావును ఓదార్చేవారేరీ?

క్లాసురూమ్‌లో ఒక్కడే వెక్కి వెక్కి ఏడుస్తున్న అతని భుజంపై సానుభూతిగా చేయి వేశాను.

"నాకేమీ తెలియదు సార్! నన్ను నమ్మండి సార్! అసలు టీజ్ చేసినవాడు పారిపోయాడు. నేను దొరికిపోయాను. నన్ను నమ్మండి. నా ఖర్మ సార్" నెత్తి బాదుకుంటున్నాడు.

"టేకిట్ ఈజీ మై బాయ్! జరిగిందేదో జరిగిపోయింది. పరిస్థితులు కలిసిరాని సంఘటనకు బలైపోయావు. జాగ్రత్తగా ఇంటికి వెళ్ళు" అతన్ని ఓదార్చాను.

అంతే! మరునాడు నుండీ అతను కనిపించలేదు.

పది రోజులైంది. పదిహేను రోజులైంది. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయి. అతను అడ్రస్ లేదు. డిస్టింక్షన్ స్టూడెంట్ ఏమైపోయాడో!

అతని ఇంటి అడ్రస్ కనుగొని ఇంటికి వెళ్ళాను.

అతని తండ్రి బాగానే రిసీవ్ చేసుకున్నాడు.

"మీవాడు ఎలా వున్నాడండీ? ఈ మధ్యన కాలేజీకి రావడం లేదు." సుగుణాకరరావు గురించి వాకబు చేశాను.

"ఎలా వస్తాడు సార్? అంత అవమానం జరిగిన తర్వాత ఏం ముఖం పెట్టుకుని వస్తాడు సార్!" తండ్రి ఆవేదనగా అన్నాడు.

"అయితే... పరీక్షలు రాయడా!"

"రాస్తే రాస్తాడు. లేకపోతే లేదు"

"అతని బ్రిలియంట్ కెరీర్ పాడైపోతుందేమో!" అనుమానంగా అన్నాను.

"పోవాలని అనుకుంటామా సార్! విధి అలా వెక్కిరిస్తోంటే..." ఆయన మధనపడుతూనే వున్నాడు.

"అలా అని...'గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అంటామా!"

"నిజమేననుకోండి. వాడి పరిస్థితి దయనీయంగా వుంది. శూన్యం లోకి చూస్తుంటాడు. ఎక్కడెక్కడో ఆలోచిస్తుంటాడు. అన్నపానాదులు లేవు. ఎవరైనా తినిపిస్తేనే అన్నం తింటాడు. ఒంటరిగా వుండాలని కోరుకొంటాడు..." ఆయన సుగుణాకరరావు పరిస్థితి వివరించాడు.

"అలా వుండడం చాలా ప్రమాదకరం! అదే 'డిప్రెషన్'లోకి దారి తీస్తుంది. అతన్ని నలుగురు మధ్యన తిరగనివ్వాలి. నలుగురూ కల్పించుకోనైనా అతన్ని మాట్లాడించాలి. అతను పదిమంది మధ్య వుంటే తప్ప మళ్ళీ మామూలు మనిషి కాలేడు. జస్ట్... డైవర్షన్ కోసం మంచి సినిమాలు చూపించండి. షికారుకు తీసుకువెళ్ళండి. వీలుంటే... యింట్లో వున్నంతసేపైనా టీవీకి అలవాటు చేయించండి. తేలికగా మనిషి ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది. క్రమంగా మామూలు వాడై పోతాడు." నాకు తోచిన సలహా చెప్పాను.

"అదే ప్రయత్నంలో వున్నాం సర్! క్రమంగా టీ.వి.కి అలవాటవుతున్నాడు. హాల్లో అందరితోబాటే ప్రస్తుతం టీ.వి. చూస్తున్నాడు. పిలిపించమంటారా!"

"వద్దులెండి! ఎలావున్నాడో కనుక్కుందామని వచ్చాను."

ఇంతలో హాల్లోంచి గావుకేకలు వినిపించాయి.

"..టి.వి. గొంతు నొక్కేస్తారా.. టీ.వి.ని చంపమంటారా.."

తండ్రితోబాటు నేనూ హాల్లోకి పరిగెత్తాను.

టి.వి.లో లైవ్ కార్యక్రమం ప్రసారమౌతోంది. యాంకర్ చాకచక్యంగా తన మాటలతో ప్రేక్షకుల బలహీనతలతో ఆడుకుంటోంది.

"టి.వి.ని ఆఫ్ చేస్తారా... బ్రద్దలు కొట్టమంటారా!"

సుగుణాకరరావు పూనకం వచ్చిన వానిలా ఊగిపోతున్నాడు.

అంతలో తండ్రి టి.వి. స్విచ్ ఆఫ్ చేసేశాడు.

ఆ కుర్రవాని ముఖంలో తీవ్రమైన భావ సంఘర్షణ! కణతలు నొక్కుకుంటున్నాడు. బాధగా జుట్టు పీక్కుంటున్నాడు.

ఈవ్ టీజింగ్ ప్రాబ్లెమ్ ఎలా వచ్చిందో నాకు అర్థమైంది.

"అతనికి బాగా రెస్ట్ ఇవ్వండి.. శారీరకంగా! మానసికంగా!! దయచేసి ఈ ప్రోగ్రామ్‌ను మాత్రం చూపించే ప్రయత్నం చేయకండి.." సలహా ఇచ్చి వచ్చేశాను.

సందేహం లేదు! అది.. శ్రోతలు కోరిన పాటల కార్యక్రమం! 'లైవ్'లో ప్రసారం అవుతోంది.. ఫ్రం ది మోస్ట్ పవర్‌ఫుల్ ఎలక్ట్రానిక్ మీడియా నుండి!! ❋

## శ్రీ రాధామనోహరన్‌కు సాహిత్య సన్మాన్



హర్యానా రాష్ట్ర సాహిత్య సమితి, జైమినీ అకాడమీవారి "శ్రీమతి సుభద్రాకుమారీ జన్మ శతాబ్ది సాహిత్య సన్మాన్-2003" తెలుగులో శ్రీ రాధామనోహరన్ (కాసరబాద సుబ్రహ్మణ్యశర్మ - 23.11.1944) కు లభించింది. పానిపట్‌కు చెందిన హిందీ కవయిత్రి శ్రీమతి సుభద్రా కుమారీ చౌహాన్ శతజయంతినాడు 4.10.04 న ఈ పురస్కారాన్ని రాధామనోహరన్‌కు యిస్తారు. 1963 నుంచీ ఫ్రీలాన్స్ రైటర్‌గా తెలుగులో విశేష కృషిచేసినందుకు రాధామనోహరన్‌ను ఎంపిక చేశామని సంస్థ నిర్దేశకులు డా॥ వీరేంద్ర కుమార్ జైమిని తెలిపారు. 2 అనువాదాలు, 50 కథలు, 25 రేడియో నాటికలు, 45 పుస్తకాలు, దాదాపు 2000 సచిత్ర వ్యాసాలు రాసిన రాధామనోహరన్‌కు 1974 కేంద్ర ప్రభుత్వ పురస్కారం (టెలివిజన్ కథ) 1972 (ఆంధ్రపత్రిక దీపావళి బహుమతి) లభించాయి. "ఆచార్య నాగార్జునుని జీవిత చరిత్ర, మంత్ర తంత్ర వైద్య ప్రక్రియలు" అనే గ్రంథం ఇటీవలనే విడుదలయింది. "పిడికెడు నక్షత్రాలు" రేడియో నాటిక అన్ని భారతీయ భాషలలోకి అనువాదం అయి ప్రముఖుల ప్రశంసలు పొందింది. 40 సం॥ రచనా జీవితంతో పాటు 61 వ జన్మదినం జరుపుకుంటున్న శ్రీ శర్మగారికి ప్రియదత్త హార్దిక శుభాకాంక్షలు తెలుపుతోంది. వీరి కలం నుంచి మరిన్ని రచనలు వెలువడాలని ఆశిద్దాం. - ఎడిటర్